
ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025
5
విజయనగరం



హమ్మయ్యా.. ఇంటికి చేరాం



విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న యాత్రికులతో ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లిన 40 మంది క్షేమంగా గురువారం తమ ఇళ్లకు సురక్షితంగా చేరారు. నేపాల్ నుంచి వచ్చిన యాత్రికులను విశాఖ ఎయిర్ పోర్టు వద్ద ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలిసి, స్వాగతం పలికారు. కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశాలతో విజయనగరం తహశీల్దార్ కూర్మనాథరావు అధ్వర్యంలో 10 కార్లలో వారిని ఇళ్లకు పంపించారు. ఆర్‌టిఎ అధికారులు కార్లను ఏర్పాటు చేశారు.



మరో వ్యక్తి సాయంతో నది దాటుతున్న వృద్ధురాలు

అక్కడ అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడుకోవాలంటే ప్రాణాలు తెగించి నది దాటాల్సిందే! స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నియోజకవర్గ కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. గజపతినగరం మండలం మర్రివలస గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యకు నిలువుటద్దం. ప్రతిసారి వర్షాకాలంలో చంపావతి నది దాటేందుకు మర్రివలస గ్రామస్తులు పెద్ద యుద్ధమే చేస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి నది దాటాల్సిన పరిస్థితి వస్తోంది. వైద్యం, విద్య, నిత్యవసర సరుకులు ఇతర అవసరాలు ఏమి తీర్చుకోవాలన్న ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని నది దాటాల్సిందే.



సరుకులతో నదిలోనుంచి వెళ్తున్న వ్యక్తి

ప్రాణాలు కాపాడుకోవాలంటే.. సాహసం చేయాల్సిందే

- 'చంపావతి'పై వంతెన ఏర్పాటులో కాలయాపన
- కొనసాగుతున్న పాలకులు, అధికారుల నిర్లక్ష్యం
- ఏటా వర్షాకాలంలో మర్రివలస గ్రామస్తులకు పాట్లు

ప్రజాశక్తి - గజపతినగరం

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిపై వంతెన లేకపోవడంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనేపథ్యంలో చిన్నారులను పాఠశాలలకు తీసుకొని వెళ్లడానికి వారి తల్లిదండ్రులు పీకల లోతుల్లో నీటిలో దిగి దాటించవలసిన పరిస్థితి నెలకొంది. నిత్యవసర సరుకుల కోసం వెళ్లేందుకు నిరీక్షిస్తున్న ఓ వృద్ధురాలిని అటుగా వెళ్లిన ట్రాక్టర్ యజమాని చెయ్యి పట్టుకొని దాటించవలసిన పరిస్థితి ఏర్పడింది. వంతెన నిర్మిస్తామన్న రాజకీయ నాయకుల మాటలు నీటి మూటలేనని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. చంపావతి నదిపై వంతెన నిర్మించడం ద్వారా సిగడం వలస, రాయివలస, ఎర్రడ వలస గిరిజన గ్రామాలకు ఇబ్బందులు తొలుగుతాయని ప్రజలు చెబుతున్నారు. అదేవిధంగా మెంటాడ మండలంలో మరో మూడు గిరిజన గ్రామాలకు రోడ్డు మార్గం కూడా ఇదే. గత టిడిపి పాలనలో కెఎ నాయుడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంతెన నిర్మాణానికి 3.30 కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ వైసిపి ప్రభుత్వం లో టెండర్ విధానం ద్వారా ఐదు కోట్ల 30 లక్షలకు నిధులు పెంచి గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని శంకుస్థాపనలు చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించక పోవడంతో టెండర్ రద్దయ్యింది. ఇటీవల గ్రామస్తులు, గ్రామ పెద్దలు స్థానిక ఎమ్మెల్యే మంత్రి కొండపల్లి శ్రీనివాసును కలిసి వంతెన నిర్మించాలని కోరగా నేరుగా గ్రామానికి వచ్చే సమస్యను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మర్రి వలస సర్పంచ్ అర్జున్ ప్రజాశక్తికి తెలిపారు.

కలెక్టర్‌గా రామసుందర్‌రెడ్డి

బిఆర్ అంబేద్కర్‌కు బదిలీ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా నూతన కలెక్టర్‌గా 2015 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన రామసుందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజి వెళ్లనున్నట్టు సమాచారం. రామసుందరరెడ్డి ప్రస్తుతం సిఎడిఎ రీహేబిలిటేషన్, అండ్ రీ సెటిల్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో తుడా (తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) సెక్రటరీగా, అంతకుముందు తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. బదిలీపై వెళ్లనున్న అంబేద్కర్ 2024 జూన్ 25న విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లాలోని అందరి ప్రజాప్రతినిధులతో కలిసిమెలిసి పనిచేసినప్పటికీ ఆరు నెలలుగా జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజులతో అంతర్గతంగా విభేదాలు ఏర్పడ్డాయి. ఆ విభేదాలు చిలికిచిలికి గాలివానగా మారడంతో ప్రత్యేక పరిస్థితుల్లో మినహా సాధారణంగా కలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మిగిలిన ప్రజా ప్రతినిధుల ందరితో కలిసిమెలిసి పనిచేశారు. అధికారుల పట్ల కొన్ని సందర్భాల్లో కఠినంగా ఉన్నట్టుగా వ్యవహరించి నప్పటికీ, స్నేహపూర్వకంగా వ్యవహరించారు. తన సమక్షంలో అధికారులపట్ల ప్రజాప్రతినిధులు అను చితంగా మాట్లాడేందుకు ప్రయత్నించిన సందర్భాల్లో అధికారులకు అండగా నిలబడేవారు. రెవెన్యూ సమస్యలు, ఎయిర్‌పోర్టు భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేకమైన చొరవ చూపించారు. జిందాల్ భూముల విషయంలో ప్రభుత్వ వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. అయితే, ఈ విషయంలో పొలిటీషియన్‌లా మాట్లాడారన్న టాక్ పబ్లిక్ నుంచి వినిపించింది.

13,14 తేదీల్లో జెవివి రాష్ట్ర మహాసభ

జయప్రదం చేయాలని జిల్లా నాయకుల పిలుపు ● వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న జెవివి నాయకులు వెంకటరావు, రాజగోపాల్, దివాకర్, నిర్మల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13,14 తేదీల్లో విజయనగరం జిల్లా కేంద్రంలో జరుగనున్న జెవివి 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, నాయకులు వి.రాజ్ గోపాల్, చీకటి దివాకర్, జి.నిర్మల పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1987 నుంచి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడమే లక్ష్యంగా జెవివి కృషి చేస్తోందన్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, మహిళా సాధికారిత, యువతకు ఉపాధిపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ఇదే దృక్పథంతో దేశంలో పని చేస్తున్న సంస్థలతో కలిసి పని చేస్తోందన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా శాస్త్రీయ దృక్పథం, ఆలోచన లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తోందన్నారు. ఈ నేపథ్యంలో విజయనగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో శని, ఆదివారాల్లో జరిగే రెండురోజుల మహాసభకు మేధావులు, మాజీఎమ్మెల్సీలు హాజరవుతున్నారని తెలిపారు. నేడు ప్రపంచ శాంతి, అభివృద్ధి, పర్యావరణం వంటి అనేక సమస్యలు దేశంలో ఉన్నాయని, వాటి పరిష్కార మార్గాలపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. మహాసభ ప్రారంభ సభకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎఐపిఎస్ఎన్ జాతీయ కార్యదర్శి ఆశామిశ్రా, ప్రధాన వక్తగా మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ , చెకుముకి పత్రిక పూర్వ సంపాదకులు ఎ.రామచంద్రయ్య పూర్వ ఎంఎల్‌సి వి.బాల సుబ్రహ్మణ్యం హాజరవుతారని తెలిపారు. తొలిరోజు రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తారని తెలిపారు. 14న ఉదయం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పర్యావరణంపై ప్రసంగిస్తారని తెలిపారు.

14వ తేదీ ఉదయం ఆరు గంటలకు మయూరి హోటల్ నుంచి బాలాజీ జంక్షన్, కోట మీదుగా గురజాడ నివాసం, మ్యూజిక్ కాలేజీ వరకు సైన్స్ వాక్ ఉంటుందన్నారు. గురజాడ ఇంటిని కాపాడాలని, సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వాక్ జరుగుతుందన్నారు. సమాజ హితం కోరే మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. మహాసభలో రాబోయే రెండేళ్ల పాటు చేయబోయే కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. అనంతరం మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు విశేష స్పందన

ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు 500 మంది హాజరు ● అండర్-14, 17 విభాగంలో రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అండర్ 14, 17 బాల బాలికల విభాగాల్లో ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికలు జరిగాయి. 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు అదే విధంగా కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో జరిగిన అండర్ 17 బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజ్జి స్టేడియంలో అండర్14, 17 బాల బాలికల పెన్సింగ్ ఎంపికలకు 120 మంది హాజరయ్యారు. మొత్తం ఎంపికల కార్యక్రమంలో ఫెన్సింగ్ పోటీలకు బంగార్రాజు, పివిఎస్ ఎన్ రాజు, సౌదామని, మాధవ్ పాల్గొన్నారు. ఫుట్‌బాల్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఆదిలక్ష్మి, సిహెచ్ ఆదిలక్ష్మి, నాయుడు , శ్రీనివాసరావు, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శివకుమార్, అనురాధ, శ్రీనివాసరావు వ్యవహరించారు. మూడు విభాగాల్లో అండర్ 14,17 విభాగాల్లో బాల,బాలికలు జట్లను ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.గోపాల్, ఎస్. విజయలక్ష్మి తెలిపారు.



గాంధీ సమాధికి వినతి అందిస్తున్న జిందాల్ నిర్వాసితులు

మహాత్మా.. న్యాయం చేయండి

గాంధీ సమాధికి జిందాల్ నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమకు న్యాయం చేయాలంటూ ఢిల్లీకి వెళ్లిన జిందాల్ నిర్వాసితులు రెండో రోజు గురువారం గాంధీ సమాధికి వినతిని అందజేసి నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యాన మహాత్మా గాంధీ రాజ్ ఘాట్ వద్దకు చేరుకొని జిందాల్ నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.

17న ఆటో బంద్



ఆటో బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - గజపతినగరం

ఈ నెల 17న జరిగే ఆటో, టాటా మ్యాజిక్‌ల జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గజపతినగరంలోని మెంటాడ రోడ్‌లో సిఐటియు, ఎఐఎఫ్‌టియు న్యూ ఆధ్వర్యంలో బంద్ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. 17న విజయనగరంలో కోట దగ్గర నుండి మయూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఎస్ఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర నాయకులు ఆర్.నారాయణరావు, జిల్లా అధ్యక్షులు ఎన్.అప్పలరాజు రెడ్డి, బాలి రాము, ఎ.రామానందం, టాటా మ్యాజిక్ జిల్లా నాయకులు అప్పారావు, సూర్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

మాత, శిశు మరణాలు నివారించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాత, శిశు మరణాలు సంభవించకుండా చూడాలని డిఎంహెచ్ఒ జీవనరాణి వైద్యులను ఆదేశించారు. గురువారం డిఎంహెచ్ఒ అధ్యక్షతన జిల్లాలోని ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందితో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. మాతృ, శిశు మరణాల జిల్లా ఉప కమిటీ సమీక్షా సమావేశం డిఎంహెచ్ఒ ఛాంబర్‌లో నిర్వహించారు. గత నెలల సంభవించిన శిశు మరణాలలో ఎంపిక చేసిన మూడు శిశు మరణాలపై సమీక్షించారు. భవిష్యత్తులో మరణాలు సంభవించకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత శ్రేణి ఆసుపత్రికి తరలించే వరకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. సమావేశంలో మాతృ, శిశు మరణాల జిల్లా ఉప కమిటి నోడల్ అధికారి ఆర్. అచ్యుత కుమారి, డిసిహెచ్ఎస్ బి.బి.ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగకు రూ. 59.70 లక్షలతో పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


అక్టోబర్ 6, 7తేదీల్లో జరుగనున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి రూ.59.70 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నగరపాలక సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 1.85 లక్షల రూపాయలతో పండగ 3 రోజులు నగరంలో అన్ని ప్రాంతాల్లో తాగునీటి పంపిణీకి చర్యలు తీసుకోనుంది. రూ.4.20 లక్షలతో వివిధ ప్రాంతాలలోనూ, ప్రధాన జంక్షన్లలోనూ ఫౌంటెన్లకు ఇతర మరమత్తు పనులు చేపట్టనున్నారు. రూ.9.70లక్షలను తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు కేటాయించారు. రూ.10.65 లక్షలతో నగరంలోని సెంట్రల్ డివైడర్‌లు, బుద్ధుడి విగ్రహం నుండి సిఎంఆర్ జంక్షన్ వరకు రామానాయుడు రోడ్డు, సంతకాల వంతెన, నీలాటి చెరువు ప్రాంతాలలో పెయింటింగులు పనులు ఇప్పటికే ప్రారంభించారు. రూ.16లక్షలతో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ చేపట్టనున్నారు. రూ.4.60లక్షలతో డివైడర్లు వద్ద రోప్ లైటింగ్, మరమ్మతులకు గురైన రోప్ లైటింగ్‌ను సరి చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. రూ.3.20లక్షలతో జనరేటర్లు, ఫ్లడ్ లైట్లను అద్దె ప్రాతిపదికన తీసుకోనున్నారు. రూ.5లక్షలతో మూడు రోజుల పండుగ నిమిత్తం షిఫ్టుల వారీగా 300 మంది ప్రత్యేక పారిశుధ్య కార్మికులను వినియోగించనున్నారు. రూ.4.50లక్షలతో ప్రత్యేక పారిశుధ్య పనిముట్లు ఇతర సామాగ్రి నిమిత్తం వినియోగించనున్నారు.



డివైడర్ గ్రిల్స్‌కు పెయింట్ వేస్తున్న కార్మికుడు

అసౌకర్యం లేకుండా చర్యలు

విజయనగరం ఉత్సవాలు, పండగకు వచ్చే భక్తులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నగర పాలక సంస్థ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఇప్పటికే అన్ని రోడ్ల మరమ్మత్తు పనులు, సుందరంగా నగరాన్ని ఉంచేందుకు పెయింటింగ్ పనులు ప్రారంభించామన్నారు. తాగునీరు, ప్రత్యేక లైటింగ్, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కోసం రూ.59.70 లక్షలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పనులు ప్రారంభించామని తెలిపారు.



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

కలెక్టర్‌తో ఎమ్మెల్యే బేబినాయన భేటీ

నియోజకవర్గ సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-బొబ్బిలి

కలెక్టరేట్‌లో కలెక్టర్ అంబేద్కర్‌తో ఎమ్మెల్యే బేబినాయన గురువారం భేటీ అయ్యారు. బొబ్బిలి నియోజకవర్గ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కలెక్టర్ దృష్టిలో పెట్టిన సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బేబినాయన కోరారు. బొబ్బిలి మండలం అలజంగి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు ఉన్నారు.

రాజాంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- రాజాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజాం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపల్ పి.భాస్కరరావు మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి నిరుద్యోగ యువతకు 'మెగా జాబ్ మేళా' మంచి అవకాశం కల్పిస్తుందని అన్నారు. ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 29 బహుళ జాతి కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారని, 412 మంది అభ్యర్థులు హాజరు కాగా పలు కంపెనీలకు 132 మంది ఎంపికయ్యారని ఆయన తెలిపారు. మరొక 22 మంది తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి రూ. 10వేల నుంచి రూ.25వేల వరకూ జీతం ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి భాస్కర్, కోఆర్డినేటర్ వంశీకృష్ణ, ఎపిఎస్ఎస్‌డిసి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సర్వజన ఆసుపత్రి ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు, తాత్కాలిక నిర్మాణాలను పోలీసు బందోబస్తు మధ్య నగరపాలక సంస్థ ప్రణాళిక అధికారులు, సిబ్బంది గురువారం తొలగించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి స్వచ్ఛందంగా తరలి వెళ్లాలని సూచించినా కొంతమంది నిర్లక్ష్యంగా అక్కడే ఉండటంతో ప్రణాళిక సిబ్బంది రంగంలోకి దిగారు. పోలీస్ బ్యారక్స్ గేట్ నుండి గ్యాస్ గోడౌన్ వరకు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగింది. ఇరువైపులా ఉన్న ఆటో స్టాండ్‌ను నిర్దేశిత ప్రాంతంలో మాత్రమే ఉంచాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి డ్రైవర్లకు సూచించారు.

తాటిపూడికి భారీగా వరద



గోస్తనీ నదిలోకి విడుదల చేసిన నీరు

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడి జలాశయంలో భారీగా వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 480 క్యూసెక్కులు ఉందని ప్రాజెక్టు ఎఇ శంకర్ తెలిపారు. రిజర్వాయరు పూర్తి నీటి మట్టం 297 అడుగులకు గాను 295 అడుగులకు చేరిందని చెప్పారు. ఇన్‌ఫ్లో పెరగడంతో గురువారం సాయంత్రం తాటిపూడి ప్రాజెక్టు గేటు తెరిచి గోస్తనీ నదిలోకి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. దిగువన ఉన్న మధుపాడ, చినమధుపాడ, గోపాలపల్లి, వేములపల్లి, తదితర గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

చక్కెర ఫ్యాక్టరీలపై అసెంబ్లీలో చర్చించండి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఈనెల 18 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన సహకార చక్కెర ఫ్యాక్టరీలపై ప్రభుత్వం చర్చించి రైతులకు, కార్మికులకు న్యాయం చేయాలని రాష్ట్ర చక్కెర శాఖ కమిషనర్ వి.వెంకటరావును లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు గురువారం వెలగపూడిలోని కమిషనర్‌తో సమావేశమై ఉత్తరాంధ్రలోని చెరకు రైతులు,కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 2019 నుండి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ని చక్కెర ఫ్యాక్టరీ లకు తీరని అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అదే పరిస్థితి నేటికీ కొనసాగుతుందని తెలిపారు. మూత పడ్డ సుగర్ ఫ్యాక్టరీ ల ఉద్యోగుల, కార్మికుల పిఎఫ్, గ్రాట్యుటీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో చాలామంది కార్మికులు ఆవేదనతో మరణించారని, రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇంత జరుగుతున్నా ఫ్యాక్టరీ ల పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా లోని మంత్రులు, ఎంపీలు కనీసం నోరు మెదపకపోవడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా సహకార సంఘాలు బలోపేతానికి కేంద్రం కృషి చేస్తుంటే దిక్కుమాలిన రాజకీయాలతో రాష్ట్రంలో సహకార చక్కెర ఫ్యాక్టరీలు చతికిల పడిపోయాయని అన్నారు.

హోటల్ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

ఎపిహెచ్ఎ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

రాష్ట్రంలో హోటల్ అసోసియేషన్ రంగాన్ని రానున్న కాలంలో మరింత బలోపేతం చేస్తామని, అభివద్ధి పథంలో నడిపిస్తామని ఏపీ హెటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని మెట్రో కన్వెన్షన్‌లో గురువారం జరిగిన ఎపిహెచ్ఎ రాష్ట్ర అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షునిగా విజయనగరానికి చెందిన జి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన కలమెడి రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన ఎదపాటి కొండయ్య, కోశాధికారిగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన బైల లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన అనంతరం రాష్ట్రంలో హోటల్ రంగం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. హోటల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. హోటల్ రంగం ఒక ఇండస్ట్రీ గా పనిచేస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోందని, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం తో పాటు పర్యాటకంగా అనేక సేవలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అన్ని జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు పి.వాసు, కె.సునీల్, కోశాధికారి జి.కె.చైతన్య, హోటల్స్ యజమానులు పాల్గొన్నారు.



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

అంబాడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ గ్రామంలో అతిసారతో 1వ తరగతి విద్యార్థి ముడిదాన కిరణ్ బుధవారం మృతి చెందడంతో ప్రజాశక్తిలో అతిసారతో విద్యార్థి మృతి అనే కథనానికి ఉన్నతాధికారులు స్పందించి బూరాడ వైద్యాధికారి చలమయ్య, రీనా చౌదరి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ అతిసార, జ్వర పీడితులను పరిశీలించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్ నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ చింతలవలసలో ఉన్న ఎస్‌విఎస్ ఎపిఎస్‌పి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉపాధ్యాయులుగా పని చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ మల్లిక గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 4వ తరగతికి బోధించడానికి హిందీ, గణితం సబ్జెక్టులకు, ఇంటర్, బిఎ, బిఎస్‌సితో పాటు డిఇడి, బిఇడి అర్హత ఉండాలన్నారు. ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులలో చెప్పడానికి బిఎ, బిఎస్‌సి, ఎంఎస్‌సిలతో పాటు బిఇడి, ఎంఇడి తదితర అర్హతలు కలిగి ఉండాలన్నారు. svsemschool11@gmail.com వాట్సాప్ నెంబర్ 73282234573 లకు తమ దరఖాస్తులను పంపించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం బిడబ్ల్యుఒ అధికారి ఎన్.గణేష్ ఆర్‌ఐ సెల్ నెంబర్ 940906345 కాంటాక్ట్ చేయాలని కోరారు.

క్వాంటం వ్యాలీ హాక్‌థాన్‌లో 'లెండి' ప్రతిభ

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడలోని లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు, ప్రతిష్ఠాత్మకమైన అమరావతి క్వాంటం వ్యాలీ హాక్‌థాన్ నార్త్ కోస్టల్ రీజియనల్స్‌లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ నెల 10న విశాఖలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని యువ ఇంజనీర్ల భవిష్యత్‌కు అవసరమైన ఫ్యూచర్-రెడీ నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా చేపట్టారు. ఇంజినీరింగ్ విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే దిశగా నిర్వహించిన హాక్‌థాన్‌లో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుండి 35 బృందాలు పాల్గొనగా లెండి నుంచి పాల్గొన్న రెండు బృందాలు విజయం సాధించాయని డీన్ డాక్టర్ వసంత్, కెవై మార్గదర్శకత్వం, పి. సంగీత చెప్పారు. ఈ బృందాలు ఈనెల 13న అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి హాకథాన్‌కు అర్హత సాధించాయన్నారు.

ఆయిల్‌పాం రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం అలజంగి గ్రామంలో ఆయిల్‌పాం రైతులకు శిక్షణ ఇచ్చారు. మండల ఉద్యాన అధికారి ఎస్. వెంకటరత్నం మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగువిధానం, రైతులకు కలిగే ప్రయోజనాలు, దిగుబడి, నికర ఆదాయం, గిట్టుబాటు ధర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను తెలియజేశారు. స్వదేశీ మొక్కలకు ఎకరాకు రూ.8 వేలు, విదేశీ మొక్కలకు ఎకరాకు రూ.11,600 రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం నిర్వహణకు ఏడాదికి ఎకరాకు రూ.2100 చొప్పున నాలుగేళ్లపాటు రాయితీ ఇస్తామన్నారు. ఆయిల్ తోటల్లో అంతర పంటలుగా అరటి, కూరగాయలు, బొప్పాయి, మొక్కజొన్న, మినుములు, పెసలు వేసుకునే రైతులకు ఎకరాకు రూ.2100 చొప్పున నాలుగేళ్లు రాయితీ కల్పిస్తామని చెప్పారు. లక్ష్మీ బాలాజీ ఆయిల్ పామ్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, సర్పంచ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని తహశీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. గురువారం సిహెచ్ బొడ్డవలస గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. సచివాలయంలో రెవెన్యూ పరమైన సేవలపై తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తవలస గిరిజన గ్రామాన్ని సందర్శించి, గిరిజనుల సమస్యలు తెలుసుకొన్నారు. సర్వే నిర్వహించి అర్హత ఉన్న గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొట్టాం విద్యార్థులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.వి.రాంకుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు కొత్తలి తనూజ, సిరికి మహిత జూనియర్ స్థాయిలో, బొబ్బిలి మౌనిక, యాండ్రపు హేమ ప్రియ, 9వ తరగతి విద్యార్థి మేడిశెట్టి అలేఖ్య సబ్ జూనియర్ స్థాయిలో ఎంపిక కావడంతో గురువారం వారిని హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.గోపి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేయొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమగ్ర శిక్ష - విద్యాశాఖలో కీలకంగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో ఆలస్యం చేయరాదని స్టేట్ జెఎసి సభ్యులు ఆరికతోట రామకృష్ణ, లెంక సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం వారు ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ మండల విద్యాశాఖ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, భవిత సెంటర్, కెజిబివిలలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేలమంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన జీతాలు సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సెపక్ తక్రా జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెపక్ తక్రా జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పోటీలకు కొండగుంపాం విద్యార్థి ఎంపికయ్యింది. గురువారం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సెపక్ తక్రా జిల్లా స్థాయి పోటీల్లో కొండగుంపాం జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పతివాడ ధన దీక్షిత (7వ తరగతి) వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లా స్థాయికి ఎంపికయ్యింది. జిల్లా స్థాయిలో ఎంపికైన దీక్షితను అలుగోలు హెచ్‌ఎం కె. కస్తూరి, కొండగుంపాం హెచ్‌ఎం వి.వేణు గోపాలరావు, పీడీ సూర్యారావు అభినందించారు.

సంకల్ప్‌పై అవగాహన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సంకల్ప్ కార్యక్రమంపై గురువారం వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలకు ఉన్న పథకాలు, రక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి , పోలీస్ ఫెసిలిటేషన్ ఆఫీసర్ శోభారాణి, పారా లీగల్ లాయర్ బ్యూలా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ :మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు గురువారం సంకల్పంపై ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అవగాహన కల్పించారు. సంకల్పం ముఖ్య ఉద్దేశం, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య, చైల్డ్ లైన్ ఏ విధంగా పనిచేస్తాయో, వాటి హెల్ప్ లైన్ నంబర్లను తెలియజేశారు. డ్రగ్స్, మత్తు పదార్థాలను వాడడం వల్ల నష్టాలను వివరించారు. బాల్యవివాహాలతో నష్టాలను తెలిపారు. హెచ్‌ఎం ఆర్.రామకృష్ణ, సోషల్ వర్కర్ పద్మ, సూపర్వైజర్లు గాయత్రి, శాంతిలత, అనురాధ, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల లోపం.. రైతులకు శాపం

- ఇ-క్రాప్ నమోదులో అలసత్వం
- మండలంలో 20 శాతం కూడా నమోదు కాని ఇ-క్రాప్
- రైతుల ఖాతాలు ఓపెన్ కాలేదంటున్న వ్యవసాయాధికారులు
- జెఎల్‌పిఎం నెంబర్‌తో సమస్యలున్నాయంటున్న రెవెన్యూ అధికారులు
- ఈనెల 15తో ముగియనున్న ఆన్‌లైన్ పోర్టల్



ఇ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి-చీపురుపల్లి

అధికారుల నిర్లక్ష్యం కారణంగానో లేక వారి మధ్య సమన్వయ లోపం కారణంగానో ఇ-క్రాప్ నమోదు చేయకపోవడం వల్ల ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట దెబ్బతింటే రైతుల పాలిట శాపంగా మారనుంది. అకాల వర్షాల వల్ల, ఏదైనా విపత్తు వల్ల గాని పంట నష్టంపై వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఇ-క్రాప్ బుకింగ్ యాప్ ప్రామాణికంగా తీసుకొని రైతులు పండించే పంట నష్టంపై ప్రభుత్వం నుండి, ఆయా బీమా సంస్థల నుంచి రైతులకు అందాల్సిన పంట నష్టపరిహారం అందుతుంది. ఇ-క్రాప్ పోర్టల్‌లో రాష్ట్రస్థాయి సమాచారంతో పాటు జిల్లాలు, డివిజన్లు, మండలాలు, క్లస్టర్ల వారీగా వివరాల నమోదు చేయాల్సి ఉంది. క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి (ఎఇఒ) పర్యవేక్షిస్తుంటారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న సర్వే నెంబర్లలో, రైతులు ఏ సర్వే నెంబరులో ఏ పంట సాగు చేస్తున్నారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేసారు? వంటి వివరాలను ఎఇఒలు తమ ట్యాబ్‌ల ద్వారా ఇ-క్రాప్ పోర్టల్‌లో నమోదు చేయాలి. దీని ప్రకారం రైతులు వేసే పంట ఏ సర్వే నెంబరులో ఉంది? అది ఎంత మేర దెబ్బతిన్నది? ఎంత విస్తీర్ణంలో దెబ్బతిన్నది? అనే వివరాలను సేకరించి నివేదికలో పొందు పరుస్తారు. దెబ్బతిన్న రైతుల తాలూకా పంటలకు సంబంధించి రైతు పేరు, క్లస్టర్, గ్రామం, మండలం, జిల్లాతో పాటు రైతులకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకం ఖాతా నెంబరు, సర్వే నెంబరు, సాగుచేసిన విస్తీర్ణం, బ్యాంకు ఖాతా నెంబరు, ఆదార్ నెంబర్, దెబ్బతిన్న పంటకు సంబంధించిన ఫొటో ఎఇఒ ఇ-క్రాప్ పోర్టల్‌లో నమోదు చేయాలి. కానీ మండలంలో ఈ పని సక్రమంగా జరగలేదు.

మండలంలో అలజంగి, చీపురుపల్లి, గొల్లలములగాం, ఇటికర్లపల్లి, కరకాం, కర్లాం, నిమ్మలవలస, పికె పాలవలస, పెదనడిపల్లి, పేరిపి వంటి పది క్లస్టర్లున్నాయి. ఈ క్లస్టర్ల ద్వారా ఇంత వరకు కనీసం 1500 ఎకరాలను కూడా ఇ-క్రాప్‌లో నమోదు చేయకపోవడం విశేషం. గతేడాది 12,748 ఎకరాలలో వరి, మొక్క జొన్న పంటలతో పాటు ఇతర పంటలకు ఇ-క్రాప్ నమోదు చేశారు. అయితే ఈ ఏడాది కేవలం 1324 ఎకరాలలో మాత్రమే వేసిన పంటలకు సంబంధించి ఇ-క్రాప్ పోర్టల్ రైతుల వివరాలు నమోదు చేశారు. దీంతో రాబోయే రోజులలో పంటలు దెబ్బతింటే నష్టపోయే ప్రమాదముంది. ఈ విషయమై తాము నమోదు చేసేందుకు రైతులకు సంబంధించి ఖాతా నెంబర్లు గానీ, 1బిలు గానీ, అడంగల్‌లు గానీ ఓపెన్ కావడం లేదంటున్నారు. అవి ఓపెన్ అయితే తాము ఇ-క్రాప్ నమోదుకి సిద్ధంగా ఉన్నామంటూ అధికారులు దాటవేస్తున్నారు. వ్యవసాయశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నమోదు చేయాల్సిన ఇ-క్రాప్ నమోదు వారి మధ్య సమన్వయ లోపం కారణంగానే జరగడం లేదని రైతులంటున్నారు. అయితే ఈ నెల 15తో ఇ-క్రాప్ నమోదు సమయం పూర్తి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఇ-క్రాప్ ద్వారా పంటల వివరాలు, రైతుల వివరాలు నమోదు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జాయింట్ ఎల్‌పియం నెంబర్ల వల్ల ఆలస్యం

గతంలో రీ సర్వే చేసిన పది రెవెన్యూ గ్రామాలలో మాత్రమే సమస్య ఉంది. అది కూడా జాయింట్ ఎల్‌పియం నెంబర్లు ఉండడం వల్ల రైతులకు సంబంధించిన ఖాతా నెంబర్లు ఓపెన్ కావడం లేదు. రైతులు సంబంధిత సచివాలయాలలో వారి భూములకు సంబంధించి అక్కడున్న సిబ్బందికి తెలియజేయాలి. 15 రోజులులలో అది కూడా పూర్తవుతుంది.

డి. ధర్మరాజు, తహశీల్దారు, చీపురుపల్లి.



రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుంపాంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని రెల్లివలస పిహెచ్‌సి వైద్యాధికారి భాగ్యరేఖ అన్నారు. గురువారం మండలంలోని గుంపాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అనారోగ్యంగా ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్, బీపీ ఉన్నవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితం కావడంతో, వృథాగా ప్రైవేట్‌లో డబ్బులు ఖర్చు పెట్టకుండా, సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యుల ద్వారా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గజపతినగరం

ఈనెల 15న ఉదయం 11గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.పుష్పాలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

అక్కసుతోనే విమర్శలు

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు జోగారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రాలేదనే అక్కసుతో తనపై డి.శ్యామ్ నిరాధారమైన ఆరోపణలు చేశారని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె.జోగారావు అన్నారు. గురువారం స్థానిక యూత్ హాస్టల్లో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆధారాలుంటే డిఇఒకి ఫిర్యాదు చేసి నిరూపించాలని జోగారావు సూచించారు. శ్యామ్‌పై పరువు నష్టం దావా వేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.సూరిబాబు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గరివిడి

స్థానిక జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో విశేష ప్రతిభ ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయురాలు ఎం.నిర్మల తెలిపారు. మాల్కుంబ్ క్రీడాంశంలో 11 మంది విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడలలో కూడా అద్భుతంగా రాణించాలని కోరారు. జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ఉదయ్ కుమార్ కు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎ.సత్య శ్రీనివాసు, రామునాయుడు, సాహితీ, బంగార్రాజు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథెటిక్స్ వంటి క్రీడా పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి. పద్మావతి తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాల నుండి (ప్రభుత్వ మరియు ప్రైవేట్) క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో శ్రీ భవిష్య స్కూల్‌కు చెందిన క్రీడాకారులు జూనియర్ ఖోఖో (అండర్-14)బి.రక్షిత, జూనియర్ వాలీబాల్ ఎస్.మోహన్ మణికంఠ, జూనియర్ బ్యాడ్మింటన్‌లో కె.తన్విష్, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ కరస్పాండెంట్ కర్రి కుమార్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సంతోషిమాత, త్రినాధరావు, పీడీ అజయ్ కుమార్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేగిడి మండలంలో..

రేగిడి మండలంలోని పనసలవలస గ్రామంలో మండలస్థాయి అండర్ 14, 17 క్రీడా పోటీలు గురువారం ఎంఇఒ వరప్రసాదరావు, ఎరకయ్య ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు చెందిన 250 మంది విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని తలబడ్డారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో రెండు రోజులు పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు క్రీడా అధికారి ఏవి సత్యనారాయణ తెలిపారు.

వైసిపి సోషల్ మీడియా సెక్రటరీగా జగదీశ్వరరావు

ప్రజాశక్తి- వంగర

వైసిఇప అనుబంధ విభాగం సోషల్ మీడియా వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా బెవర జగదీశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వంగర మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన జగదీశ్వరరావు గతంలో ఐటివిభాగం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జగదీశ్వరరావుకు పదవి రావడం పట్ల ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, జెడ్‌పిటిసి కరణం రాధమ్మ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శన రావులతో పాటు పలువురు అభినందించారు.

సైబర్ నేరాలపై దర్యాప్తు వేగవంతం : ఎస్‌పి

ప్రజాశక్తి- డెంకాడ



పోలీసుస్టేషన్ ఆవరణలో వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి

సైబర్ నేరాలపై నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. గురువారం ఆయన డెంకాడ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషను పరిధిలో నేరాల నియంత్రణకు సాధ్యమైనన్ని ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. రహదారి ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్ వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్టేషను ప్రాంగణాన్ని, పోలీసు బిల్డింగ్‌లోని గదులను, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, ఆయా వాహనాలు ఏ కేసులలో సీజ్ చేసారన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకొని, చట్ట ప్రకారం సీజ్ చేసిన వాహనాలను డిస్పోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో నూతన ఆవిష్కరణలు

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి

ప్రజాశక్తి - బొబ్బిలి



సెమినార్‌లో మాట్లాడుతున్న కె.విజయగౌరి

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో బోధిస్తేనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక ఎస్-ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం - విద్యార్థుల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. శాస్త్రీయ విద్యను అందించాల్సిన ప్రభుత్వం మూఢ విశ్వాసాలను పెంచేలా సిలబస్ మార్చుతోందని విమర్శించారు. విద్యార్థుల ఆలోచన ప్రతి అంశంపైనా ప్రశ్నించేలా, తర్కించేలా, మూఢనమ్మకాలను దూరం చేసేలా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రేరేపించే విధంగా నిరంతర అధ్యయనం ఉండాలని చెప్పారు. ఈ నెల 13, 14వ తేదీల్లో విజయనగరంలో జరిగే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు కె.సదా శివానంద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌తో ప్రాంతీయ కళలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - నెల్లిమర్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

కళా ఉత్సవ్‌తో ప్రాంతీయ కళలకు ప్రోత్సాహం దొరుకుతోందని నెల్లిమర్ల డైట్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు అన్నారు. గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థలో విజయనగరం కళా ఉత్సవ్ 2025 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కళలు, నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించడం ప్రాంతీయ కళల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వ్యాఖ్యత వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాంశాలతో బాటు కళలను కాపాడుకుంటూ 2047 వికసిత భారత్ సాకారం కావాలన్నారు. కళా ఉత్సవ్ నోడల్ అధికారి చిన్నం నాయుడు మాట్లాడుతూ మన జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలవాలని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలల నుంచి 7 అంశాల్లో పోటీల్లో పాల్గొని తలబడ్డారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సూరిబాబు, శ్రీనివాసరావు, రమేష్, అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన చేపట్టారు. పెండింగ్ డిఎలు విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.రావు, కృష్ణమూర్తి, నాయకులు విజయకుమార్ పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పులను సరిచేయాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-బొబ్బిలి

భూ రీసర్వేలో తప్పులను సరిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. భూ సర్వేలో రైతుల భూములను సంబంధం లేని వ్యక్తుల పేరిట రాశారని తెలిపారు. దీంతో పిల్లల పెళ్లిళ్ళు, చదువులు, ఇతర అవసరాలకు భూమి అమ్మకానికి పెడితే రిజిస్ట్రేషన్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తప్పులను సరిచేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. డబ్బులు ఇస్తేనే తప్పులను సరి చేస్తున్నారని విమర్శించారు. రీసర్వే తప్పులను సరి చేసేందుకు ఎమ్మెల్యే బేబినాయన చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

300 మందికి దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- మెంటాడ

మాజీ ఎంపిపి చలుమూరి అప్పలనాయుడు సతీమణి కీర్తిశేషులు చలుమూరి నారాయణమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా జిటిపేట గ్రామంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసినాయుడు, సర్పంచ్ చొక్కాకు పైడిరాజు, డాక్టర్ గేదెల సన్యాసమ్మ, అమ్మ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చొక్కాకు సన్యాసినాయుడు, చొక్కాకు కొండమ్మ, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పత్ర కషాయాలతో అధిక లాభాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

వివిధ రకాల ఆకులతో తయారు చేసిన కషాయాలను పంటలకు వాడితే అధిక లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సూర్యకళ అన్నారు. స్థానిక గొల్లపల్లి, జగన్నాథపురంలో గురువారం పత్ర కషాయాలను తయారు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకులు, పువ్వులు, తులసితో కషాయం తయారు చేసి పంటలకు వేస్తే భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చునని, తెగుళ్లను నివారించవచ్చునని చెప్పారు.

యువతలో మానసిక స్థైర్యం అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువతలో మానసిక స్థైర్యం పెంపు చాలా అవసరమని ప్రముఖ సైకాలజిస్టు రాజు అన్నారు. మండలంలోని సతివాడ జెటిఎన్ఎం జూనియర్ కళాశాలలో గురువారం 'ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవం' సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.అనీల్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకాలజిట్టు రాజు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు, యువత మానసిక ఒత్తిడులు, పరీక్షల భయం, తెలియని భయాందోళనల కారణంగా తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను ఎదుర్కొనే ధైర్యం లేకపోవడం వల్ల చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ నర్స్ పి.మంగ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మల్టీకె ఎరువులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - గజపతినగరం



డ్రోన్ వినియోగాన్ని రైతులకు వివరిస్తున్న ఎడి

మల్టీకె (13-0-45) ఎరువులు చిరుపొట్ట దశలో వరిచేనులో పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఎడి నిర్మలజ్యోతి తెలిపారు. గురువారం లోగిస గ్రామంలో ఏర్పాటుచేసిన డ్రోన్ స్ప్రింగ్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చిరు పొట్ట దశలో యూరియా 25 కిలోలు, పొటాష్ 25 కిలోలు చొప్పున రైతులు ప్రస్తుతం వాడుతున్నారని, వీటి స్థానంలో మల్టీకె ఎరువు వాడకంతో తక్కువ సొమ్ముతో, అతి తక్కువ సమయంతో అధిక లాభాలు సాధించవచ్చని ఎడి తెలిపారు. డ్రోన్ ద్వారా ఎకరానికి 7 నుంచి 8 నిమిషాల్లోనే పిచికారీ చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేల బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన పి. రామారావు (35) గురువారం ప్రమాదవశాత్తు నేలబావిలో పడి మృతి చెందాడు. పశువుల మేతకు గడ్డి నిమిత్తం వెళ్లి నేలబావిలో జారి పడి మృతి చెందినట్లు అతని భార్య సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ తెలిపారు

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వ్యాధుల ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హెల్త్ సెక్రటరీలకు నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం తమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వేలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. శానిటరీ సెక్రటరీలతో సమన్వయం ఏర్పరచుకొని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఏంటి లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఎఎస్ఒ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తాం

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆయన ఆదేశాలతో వివిధ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ సిబ్బంది సిసి రహదారులు, కాలువలను ఏర్పాటు చేస్తున్నారు. వీధి దీపాల మరమ్మతు పనులను ముమ్మరం చేపడుతున్నారు.

పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వంగర

పామాయిల్ సాగుపై ఉద్యానవన శాఖ అధికారి సిహెచ్ ఉమామహేశ్వరి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ, రేగిడి మండలంలో గల పామ్ ఆయిల్ కంపెనీ సంయుక్తంగా వంగర మండలంలోని మరువాడలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పామాయిల్ మొక్కలను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. అంతర పంటలు వేసుకుంటే దీనికి రాయితీ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామాయిల్ మిల్ ఫీల్డ్ ఆఫీసర్ మణికంఠ, విఎఎ ఉమా రైతులు పాల్గొన్నారు.